
నాకు పెళ్లి అయి ఇరవైయేళ్లు దాటింది. నా భార్య కొంతవరకు చదువుకున్న మనిషే అయినప్పటికీ, సంస్కారం ఏకోశానా లేదని గ్రహించడానికి నాకు అయిదేళ్లు పట్టింది. పెళ్లయింతర్వాత అయిదేళ్ల వరకూ స్త్రీ-పురుష ఆకర్షణ నా కళ్లను కప్పేసింది. ఆ తర్వాత నా కళ్లు తెరుచుకున్నాయి.

జానకికి ప్రత్యేకమైన ద్వేషం ఏమీ లేదు నేనంటే. ఆ మాటకు వస్తే ఏ భార్యాభర్తలూ ప్రత్యేకంగా ఒకరంటే ఒకరు ద్వేషం పెంచుకోరనుకుంటాను. కాని భార్యలు భర్తల్నిగాని, అరుదుగా భర్తలు భార్యల్నిగాని ద్వేషించడానికి కారణం ముఖ్యంగా ఒకటే--తమ భాగస్వామిని ఇతరులతో పోల్చుకుని, "వాళ్లాయన చూడండి...వాళ్ల ఆవిడను ఎంత ప్రేమిస్తాడో! ఆవిడకు కొంచెం తలనొప్పి వచ్చినా ఇంట్లో ఏ పనీ చెయ్యనివ్వడు. అన్నీ తనే చూసుకుంటాడు. పిల్లల పనులు కూడాను" అంటుంది భార్య--ఆ కిందటి రోజే తనకు ఒంట్లో బాగాలేదంటే తన భర్తే వంట చేసిన సంగతి ఎందుకో మర్చిపోయి.

నేను గత పదిహేనేళ్లుగా గమనిస్తూ వచ్చాను. మధ్యతరగతి భార్యలు తమ భర్తల్ని వేపుకు తినటంలో ఏదో అనిర్వచనీయమైన ఆనందాన్ని పొందుతారని. కోడల్ని సాధించే అత్తలకూ, పిల్లల్ని సాధించే తల్లిదండ్రులకు కూడా ఆ ఆనందం అనుభవమే. నే నేదైనా--నా అభిప్రాయాన్ని ఏదైనా సరే--చివరకు ఒక చీపురుకట్ట గురించైనా ప్రకటించగానే, వెంటనే నా అభిప్రాయాన్ని ఖండించడంద్వారా, తన వ్యక్తిత్వాన్ని చాటుకుంటుంది మా ఆవిడ.



"ఈ రోజు చాలా ఎండగా ఉంది" అని నేను అనగానే, "చాల్లెండి, మీరన్నీ ఇట్లాగే తలకిందులుగా చెబుతారు. నిన్నటి ఎండతో పోలిస్తే ఈ రోజు ఎండ ఏపాటిది?" అని ఖండించేస్తుంది.

"ఈ రోజు చాలా విసుగ్గా ఉంది....ఏదైనా సినిమాకు పోదాం" అని గనక నేను అంటే, "అవునవును, మీ మగాళ్లు విసుగుపుడితే సినిమాలకూ వెళతారు, నాటకాలకూ వెడతారు. మా ఆడవాళ్లు మాత్రం వంటింట్లో పడి చావవలసిందే గాని, ఎప్పుడై సరదాకి అలా వెళ్లివద్దాం అంటే చాలు, అప్పుడు బైట పడతాయి మీ మగాళ్ల రంగులన్నీ" అని జాడించేస్తుంది.

ఇంతకూ నేను చెప్పొచ్చేదేమిటంటే ఆ రోజు మా బావమరిది కూతురి పెళ్లి శుభలేఖ వచినప్పుడు జానకి నా మీద, అనాదినుంచీ పురుషజాతి మీద స్త్రీలోకానికి గల ద్వేషాన్నంతా వెళ్లగక్కుతుందని నేను ఊహించలేకపోయాను.

"ఎప్పుడు బయలుదేరదాం, పెళ్లికి?" అని అడిగాను.

"చాలా విచిత్రంగా ఉందే...మా వాళ్లింట్లో శుభకార్యానికి మీ నుంచి వెళదామనే ఆలోచన రావడం. అదీ నేను అడక్కముందే! మీ వాళ్లింట్లో పిల్లి సమర్తాడినా పరుగెత్తుతారు గానీ, మా ఇళ్లలో ఏ కార్యమైనా ఏదో పేచీ పెట్టకుండా రారు గదా! ఆశ్చర్యంగా ఉంది..." అంది వెటకారంగా.

నాకు చిరాకు పుట్టింది.

"అనవసరమైన వాదన కట్టిపెట్టి ప్రయాణ మెప్పుడో చెప్పు. రిజర్వేషన్ చేయించాలి" అన్నాను.

"ఇంతోటి ప్రయాణానికి రిజర్వేషన్ కూడానా. ఏదో బస్సు పట్టుకుని పోతేసరి. అంత సుఖప్రయాణం చెయ్యాలని నాకేం పెద్ద కోరిక లేదు."

నేను మరేం వినిపించుకోకుండా బయటకు వెళ్లిపోయాను. నాకు ఆలోచన వస్తూ ఉంటుంది అప్పుడప్పుడు...మేమిద్దరం ఇలా పుల్లావిరుపు మాటలు మాట్లాడుకోకుండా 'మామూలుగా' మాట్లాడుకుని ఎన్ని సంవత్సరాలైందా అని. జానకి అలా మాట్లాడటంవల్ల ఏం సాధించగలుగుతున్నదో నాకైతే తెలియదు గానీ, ఏదో తప్పకుండా ఆశించే అలా ప్రవర్తిస్తోందని నా నమ్మకం. అదేమిటో నేనైతే ఎంత ప్రయత్నించినా గ్రహించలేక పోతున్నాను. మళ్లా నా స్నేహితులతోగానీ, అతిథులతో గానీ ఎంతో ఆనందంగా, ఆప్యాయంగా మాట్లాడగల నైపుణ్యం ఆవిడ కుంది.

000

పెళ్లికి వెళ్లాం. మాధురి చదువు చెడిపోతుందని అది వస్తానని గొడవచేసినా పట్టించుకోకుండా పక్క పోర్షన్ వాళ్లకు దాన్ని అప్పజెప్పింది. మోహన్‌గాడిని మాత్రం అక్క లేకుండా తను రానని మారాం చేస్తుంటే నాలుగు బాది ఆటో ఎక్కించింది. నాకు మాత్రం రిలీఫ్ కలిగింది. ఆవిడ ప్రవర్తనలో ఒక నా దగ్గర కాక, పిల్లల విషయంలో కూడా మార్పు లేదని గ్రహించి.

సి.వి.రావు

పుట్టింట్లో దిగుతూనే తన వాళ్లను ఎటాక్ చేసింది. ఏవో పాత విషయాలు తవ్వి తీసుకుని వచ్చి, ఇరవై ఏళ్ల కిందటి తన పెళ్లిలో వాళ్ల తల్లి గొలుసు ఇవ్వలేదనీ, అన్న పెళ్లానికి ఇచ్చిందనీ, సొట్టపడిన కారియర్ ప్రెజెంట్ చేసి తన పరువు తీసిందనీ, 'ఆయన(అంటే నేను) మంచివాడు కాబట్టి' అదేమీ పట్టించుకోలేదనీ, అదే మరో అల్లుడైతే ఏమయ్యేదోననీ...ఉదయం ఇంట్లో కాలు పెట్టినప్పటినుంచీ టిఫిన్ దగ్గరా, భోజనాల దగ్గరా, మళ్లా సాయంత్రం కాఫీ దగ్గరా, రాత్రి భోజనాల దగ్గరా మురికి బట్టలు జాడించినట్లుగా జాడించింది.

పెళ్లిలో మగవాళ్లమధ్య కూర్చుని ఉన్న నన్ను కొడుకుని పంపి అర్జంటుగా పిలిపించింది. లోపల గదిలోకి తీసుకువెళ్లి, "మీ పక్కన కూర్చున్నాడే-నల్లగా, దున్నపోతులాగా -ఎవరాయన?" అని అడిగింది.

"ఇందుకేనా పనివేళా పిలిపించింది? నేను దున్నపోతుల్తోనే స్నేహం చేస్తాను. అయితే ఏమిటి? నీ వెధవ్వాగుడూ, నువ్వూనూ."

"ఇక ఆపండి. ఇంతకూ ఎవ రాయన? అది చెప్పకుండా ఏదో మాట్లాడతారేమిటి?"

"వాడు నా చిన్ననాటి స్నేహితుడు. రామమోహనరావు అని ఎలక్ట్రిసిటీ బోర్డులో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా పనిచేస్తున్నాడు"

"అలా చెప్పండి. బాగా లంచాలు తిని ఉంటాడు. అందుకే అలా ఉన్నాడు చింతమొద్దులాగా. ఇంతకూ ఆయన పక్కన కూర్చున్న కుర్రాడెవరు? ఆయన కొడుకేనా! ఏం చేస్తున్నాడో? మన మాధురికి ఈడూజోడుగా ఉండడూ!"

"అంటే మావాడు నల్లగా చింతమొద్దులాగా వున్నా, లంచాలు బాగా తిని కొవ్వెక్కినా నీకేం అభ్యంతరం లేదన్నమాట. అయినా దానికి అప్పుడే పెళ్లేమిటి? సెకండియరేగా ఇప్పుడు. డిగ్రీ కానీ ముందు..." అన్నాను వెళ్లబోతూ.

నన్ను ఆపింది.

"మంచి సంబంధం వస్తే పెళ్లి చేయడాని కేమిటీ? అది చేసుకోనని మీతో చెప్పిందా? మీకు చేతకాకపోతే చెప్పండి...ఆయన పెళ్లాన్ని నేనే అడుగుతా. ఆవిడకెంత నిక్కు అను కున్నారూ? పలకరించినా మాట్లాడదు."

నేను మాట్లాడకుండా అక్కడనుంచి వెళ్లి పోయాను. ఆవిడకు రానురానూ మతి పోతున్నట్టు నాకు గట్టి అనుమానం కలిగింది. ఇంజనీరుగారి దున్నపోతు అవతారం, ఆయన భార్య టిక్కూ నిక్కూ ఆ సంబంధానికి ఏమీ అడ్డుగా దన్నమాట ఆవిడ వుద్దేశంలో. ఒకవేళ ఆ సంబంధంగాని అయితే వాళ్లతో ఈవిడ ప్రవర్తన ఎలా ఉంటుందో.

పెళ్లి అయిపోయాక ఇల్లు చేరాం. ఇంట్లో అడుగు పెడుతూనే నామీద విరుచుకుపడింది.

"దాని పెళ్లి మీకు ఇష్టం లేదా? ఏదో వంకలు పెట్టి పెళ్లికి అడ్డుపుల్లలు వేస్తారా?"

నేను చిరాకు కష్టం మీద అణుచుకుంటూ జవాబిచ్చాను. "నాకు చేతకాదు, నీకు చేతనైతే దానికి ఇష్టమైతే, నువ్వు చెయ్యి పెళ్లి...నాకు అభ్యంతరమేమీ లేదు."

"బాగానే వుంది, ఆడవాళ్లు చేస్తారా పెళ్లిళ్లు? ఊళ్లోవాళ్లకు అన్ని సహాయాలూ చేస్తూనే ఉంటారు. సొంత కూతురి పెళ్లంటే చేతగా దంటారు..."

నేను విడవబోతున్న చెప్పులు మళ్లీ వేసుకుని బైటికి నడిచాను.

ఆవిడకు నాతో పోట్లాడడానికి ఏదో టాపిక్ కావాలి. పండగకు బట్టల్లో, పిల్లల చదువుల్లో, ఆఫీసులో ప్రమోషన్లో, చివరకు ఏదీ దొరకకపోతే సినిమాల్లో, రాజకీయాల్లో... తనకు ప్రతిదీ ఒక టాపిక్కే నన్ను దెప్పి పొడవడానికి. సాధారణంగా పోట్లాడుకోని భార్యభర్తలు ఉండరు. పోట్లాడుకుంటూనే, కలిసి బతుకుతారు చచ్చేదాకా. కాని వాళ్లు ఏదో ఒక క్షణంలోనైనా ఒకరిమీదొకరు ప్రేమ ప్రదర్శించుకుంటారు. కనీసం బెడ్‌రూంలో నైనా. కాని జానకి మాత్రం 'ఆ సమయంలో' కూడా ఏదో 'సున్నితమైన' ఆర్గ్యుమెంట్ తీసుకువస్తుంది. అదే ఆవిడ గొప్పతనం. ప్రతి మధ్యతరగతి స్త్రీ తన భర్తను కొద్దో గొప్పో యథాశక్తి ద్వేషిస్తూనే ఉంటుందను కుంటాను. మా చెల్లెలు అంటుంది. మొగుడూ పెళ్లాలూ పోట్లాడుకోకుండా ఉంటే దిష్టి తగులుతుందని...బహుశా ఆ సిద్ధాంతం కూడా ఆవిడకు నచ్చినట్లుంది. ఆవిడ మా ఇంటికి పర్మినెంట్‌గా ఒక 'దిష్టిబొమ్మ'ను తగిలించేసింది.

నాకు అనుకోకుండా ట్రాన్స్‌ఫర్ అయింది, అది కూడా మూడువందల మైళ్ల దూరానికి.

"అంతదూరమా? నేను చచ్చినా రాను. నేనూ, పిల్లలూ హాయిగా ఇక్కడే ఉంటాం" అని తన నిర్ణయం నిర్ద్వంద్వంగా తెలియజేసింది.

నాకు ఒక్కసారిగా ఎంతో విశ్రాంతి కలిగింది మనస్సుకు. అయినా మా ఆవిడ మనస్తత్వం తెలిసినవాడిని కాబట్టి కోపం వచ్చినట్లు నటించాను.

"మతి ఉండే మాట్లాడుతున్నావా? ఈ వయసులో ఊరుగాని ఊర్లో నే నొక్కడినీ ఎలా వుంటాననుకున్నావు? భోజనం దొరుకుతుందో లేదో? ఏ జబ్బో చేస్తే చూసే దిక్కు కూడా ఉండదు." అనేశాను.

"మీకు వంట వచ్చుగదా! పైగా పిల్లల చదువులు పాడైపోవా? అక్కడ మోహన్‌కు మంచి స్కూలుకూడా ఉందో, లేదో? పోనీ మాధురిని మా మామయ్యదగ్గర ఉంచినా కూడా...అసలు అది దానికి నచ్చుకోదు. అయినా మీరు జాగ్రత్తగా ఒళ్లు దగ్గర పెట్టుకుంటే ఏ సమస్యా రాదు."

ఇంతకూ ఆ మాట ఎందుకు అన్నదంటే, నేను అప్పుడప్పుడూ కొంచెం తీర్థం సేవిస్తూ ఉంటాను. ఆవిడ వెటకారపు విమర్శ దానిగురించే. అయినా నేను మళ్లా సంభాషణ పొడిగించలేదు. ఇంకా సాగదీస్తే ఆవిడ మనస్సు మార్చుకుంటుందేమోనని భయం పుట్టింది.

ప్రయాణానికి అన్ని ఏర్పాట్లూ చేసుకున్నాక, తను కూడా వచ్చి ఇల్లూ అదీ సర్ది, నాలుగు రోజులు ఉండి వెళతానని పట్టుబట్టింది.

"ఇంకా నాకే వుండటానికి చోటు లేదు. నిన్ను తీసుకెళ్లి ఏ ప్లాట్‌ఫాంమీద కాపురం

## నవ్వే తల్లులకు నవ్వే బిడ్డలు

ఇదేదో సామెతలా వుందనుకుంటు న్నారా? కాదు, నిజమంతే! లండన్‌లో జరిగిన ఓ పరిశీలనలో తేలిన సంగతిది. గర్భిణుల మానసికపరిస్థితి తాలూకు ప్రభావం గర్భస్థశిశువు మీద డైరెక్టుగా పడుతుందట. గర్భిణి హాయిగా నవ్వుతూ, సరదాగా కబుర్లు చెబుతూ, అందరితో కలివిడిగా వుంటే, పుట్టే బిడ్డ తప్పకుండా నవ్వుమొహంతో పుడతాడు. గర్భావస్థలో స్త్రీలు ఏవో కారణాల చేత ఒంటరిగా వుండాల్సిన స్థితి ఏర్పడితే పిల్లలు అంత ర్ముఖులు (ఇంట్రావెర్ట్లు) గా పుడతారు. వంద మందికి పైగా గర్భవతులను గమనించి మరీ నిర్ధారణ చేశారీ విషయాన్ని. ఎవరికైనా తమ పిల్లలు అల్లరి వారుగా, నవ్వులు పంచేవారుగా పుట్టా లనుకుంటే, తమ స్వభావాన్ని తప్పని సరిగా మార్చుకోవలసిన అవసరం వుంది. అనవసరమైన టెన్షన్ కూడా పడకుండా వుంటేనే బిడ్డలు బాగా పుడతారని గుర్తుంచుకోవాలి.

ఎస్.

## (గడి-నుడి - 13వ పేజీ తరువాయి)

ఎం. తిరుపాలమ్మ, జి.యస్. వరలక్ష్మి, (గుంతకల్లు), కొండూరు హైమవతీశం (తిరుపతి), వారణాసి శ్రీయ (ఆదిలాబాద్), పెద్దాడ రుక్మిణి (సిర్పూర్ కాగజ్‌నగర్), చల్లా కేశవచంద్ (బెంగుళూరు), అల్లి రామకృష్ణ (కలికిరి), చీ.వెం. బృందావనరావు, వుల్లావంతుల వేంకట సుబ్బారావు (భీమవరం), తాడమేటి సుబ్బలక్ష్మి, విస్సంరాజు సీతానరసింహారావు, ఉడాలి నరసింహమూర్తి, కవ్వోజు లక్ష్మీకాంతం, గొల్లపూడి హైమవతి, టి. నిర్మల పద్మకుమారి, రాంపల్లి పద్మజారాణి, తాడేపల్లి వేంకటరత్నమ్మ (విజయవాడ), సిహెచ్. సత్యవతి (గుడివాడ), ఆలూరి భాస్కరరావు(పోరంకి), ఆకొండి సూర్యనారాయణ మూర్తి (అమలాపురం) కూచి ప్రభావతి (షుంగండ), తాడి రంగారావు , డి.మణి, టి.ఆర్. బాలకృష్ణారావు (రాజమండ్రి) బెడదకోట పద్మావతి (ఉండి) తుమరాడ సుధాహిమబిందు, అన్నంరాజు పూర్ణచంద్రరావు (విశాఖపట్నం), విశాలస్కంధ రామకృష్ణ (అనకాపల్లి), ఆర్. నరసింహమూర్తి (రాజాం), సరిపెల్ల ప్రభావతి, టి. రాజేశ్వరి, నూరి లక్ష్మీకాంతం, నరసింగోలు హనుమాయమ్మ, అడపా సత్యనారాయణ, గిరిజా శంకరరావు, పి.జి. లిల్లీరోజెస్, రావులపల్లి కేశవరావు, పిశుపాటి లక్ష్మీప్రసన్న, దావులూరి శివరామయ్య, కాకరపర్తి సత్యాలక్ష్మి, ఎ.వి.ఎస్. ప్రసాద్, బి. వీరాంజనేయులు, వడ్లమాని కృష్ణవేణి, జి.యస్. పద్మ, యస్. భానుమతి, రూపనగుడి సుగుణ, భాగవతి సత్యమూర్తి, కర్రి శేషగిరిరావు, సాధు శ్యామలాదేవి, సి. ఇందిరాదేవి, ప్రభల అనంతవల్లి, నడుపల్లి అరుణకుమారి (హైదరాబాద్), పిశుపాటి దాక్షాయణి (సికిందరాబాదు), కె.గోపాలకృష్ణమూర్తి (నిజామాబాద్), పిచ్చుక నరసింహులు (నిజామాబాద్), ఇజ్జపురెడ్డి జగదాంబ, ఆకుండి చినకామేశ్వరరావు (విజయనగరం), తెనాలి శేషగిరిరావు (జి.కె.వల్లి) యస్. పట్టాభిరామపిళ్లై (కుప్పం), కె.వి.ఎల్. నరసింహారావు, (రేణిగుంట), వి.ఆర్. మాలతి (చిత్తూరు), పి.వి. రాజు (ఆదోని), ఓరుగంటి మురళీధర్ (కర్నూలు), టి.చంద్రశేఖరరెడ్డి (కొత్తగూడెం కాలరీస్), డా. పాలంకి నవితా దత్తాత్రేయ, శ్రీమంతుల మాధవరావు, కె.ఆర్. గణపతిలింగం, శ్రీనివాసరావు కుంటుముక్కల (కాకినాడ) పెంద్యాల ఇందుమతి (గార్ల) పావులూరి దుర్గాభవాని, తూములూరు సత్యనారాయణమూర్తి (ఖమ్మం) మాడ్గుల శశికళామోహన్, ఎ.టి. శ్రీనివాసన్, ఎన్. చంగలరాయశెట్టి, జె. సావిత్రి (అనంతపురం), వై. ఉషా అన్నె (హిందూపూర్) జి.నరసింహమూర్తి (త్రిపురాంతకం) తాండ్యాల రాంచందర్ (చెన్నూరు) ఎన్. సురేఖ (హోసూరు), కణుగుల వేంకటరావు (చెన్నై). ■

పెట్టాలి? అర్థం లేకుండా మాట్లాడకు." ముందు వెళ్లి ఇల్లూ అదీ చూసుకుని తర్వాత వచ్చి తీసుకుపోతానని నచ్చచెప్పాక ఊరుకున్నది.

ఆ ఊరి స్టేషన్‌లో దిగగానే ఏదో స్వేచ్ఛ దొరికినట్లుగా మనసు అంతా తేలికైంది. న న్నడిగితే సంవత్సరానికి ఒకసా రైనా ఒక నెలరోజులపాటు భార్యా భర్తలు విడిగా ఉండాలంటాను.

వచ్చిన వారం రోజుల వరకూ రోజూ మందు పార్టీలూ, మటన్ బిర్యానీలూ...చాలా ఆనందంగా గడిచింది. ఆ తర్వాత మొదలైంది ఇంటిపైన బెంగ. ఆ బెంగ మా ఆవిడపైన అని చెప్పలేను గానీ, ఏదో పోగొట్టుకున్నట్లు వెలితిగా అనిపించసాగింది....బానిసత్వం అలవా టైయినవాడికి యజమాని చచ్చిపోతే బాధ కలిగినట్లు.

నెమ్మదిగా ఆవిడలోని లోపాలు కనబడటం మానేశాయి. పాపం, జానకి పెంపకం అలా ఉంది. చిన్న చిన్న పట్టణాల్లో పెరిగిన వాళ్ల మనస్తత్వాలు అలాగే సంకుచితంగా ఉంటాయి. గోరంతలు కొండంతలు చేసుకోవడం, ప్రతి మనిషినీ అనుమానించడం, ప్రతి వాళ్లతో ప్రతి చిన్న విషయానికీ పోట్లాడటం...ఇవన్నీ గ్రామీణుల మనస్తత్వాలు. తను చిన్నతనం నుంచీ పెద్దవాళ్ల మధ్య, ముసలమ్మల మధ్యా పెరిగింది, ఇలాటి ప్రవర్తన తప్ప ఆధునికత ఎలా అబ్బుతుంది? జానకి అంటే మెల్లగా జాలి కలగసాగింది నాలో.

తను ఒకసారి ఇక్కడకు వస్తే బాగుండును అనిపించసాగింది. నేనూ, జానకీ ఏకాంతంగా ఉండి ఎన్నేళ్లయిందో? పిల్లలు పుట్టాక, వాళ్ల చదువులూ. వాళ్ల పనులతో మాకు 'తీరిక' లేకుండా పోయింది. అసలు అదే ముఖ్య కారణమేమో మా ఇద్దరి మధ్యా ఈ విభేదాలకు కారణం?

❄ ❄ ❄

ప్రతిరోజూ నిద్రలేచి కాఫీ కలుపుకుని త్రాగడం, స్నానం ముగించుకుని, ఆఫీసుకు పోవడం, లంచ్ టైంలో హోటల్‌కు పోవడం వాడు పెట్టే చెత్త తినడం, సాయంత్రం కాగానే ఏవడో కొలీగ్‌తో కలిసి మందుకొట్టడం...ఈ రొటీన్ ఒకవారం, పదిరోజులు బాగానే వుంటుంది గానీ, అదే జీవితం అయితే విసుగు పుట్టేస్తుంది.

అనుకోకుండా ఒకరోజు టెలిగ్రాం వచ్చింది-జానకి ఫలానా రోజు వస్తున్నట్లు, స్టేషన్‌లో రిసీవ్ చేసుకోమని. ఈసారి నా మనస్సు చాలా తేలిక పడింది పూర్వంలాగా కాకుండా.

ఆవిడ వస్తూనే, రూమ్‌లోని సామాగ్రి (ఖాళీ సీసాలు) వగైరా అంతా చూసి మొహం మాడ్చుకుంది.

"రోజూ ఇదేనన్నమాట మీ వ్యవహారం? మీరే కావాలని ట్రాన్స్‌ఫర్ పెట్టుకున్నారేమోని నా అనుమానం. బుద్ధి లేకపోతే సరి, ఇంత వయస్సు వచ్చినా వెధవ అలవాట్లు..."

ఆవిడ తిట్లు తిని చాలారోజులైందేమో, నాకు సంగీతం విన్నట్లుగా ఉంది. కాని మళ్లా ఎంత గొప్ప సంగీతమైనా అప్పుడప్పుడు వింటేనే బాగుంటుంది. ఇరవై నాలుగు గంటలూ వింటుంటే అక్కడ నుంచి పారిపోవా లనిపిస్తుంది.

మళ్లా ఏమనుకున్నదో, "పోనీలెండీ, ఒక్కరూ ఉంటే విసుగు పుడుతుంది. కాని ఆరోగ్యం జాగ్రత్త. పైగా ఏ చెడ్డ అలవాటయినా ఒక్కసారిగా మానడం చాలా కష్టం. అందువల్ల మరీ రోజూ కాకుండా తీసుకోండి. వింటున్నారా..." అని అడిగింది ఎంతో ప్రేమగా నన్ను కావలించుకుని.

'ఏ అలవాటైనా అంతే...చివరకు భార్యతో కాపురం కూడా...' అందామనిపించింది. కాని అనలేదు. ■

